ప్రజాశక్తి
మంగళవారం 21 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



కేంద్ర సెక్రటరీ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఈనెల 21న మంగళవారం కేంద్ర కార్యదర్శి అతీష్ చంద్ర పర్యటిస్తున్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారి, భారత ప్రధాన మంత్రి అదనపు కార్యదర్శి అయిన ఆయన పర్యటన ఏర్పాట్లను ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ సోమవారం పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఈ పర్యటనను విజయవంతం చేయాలని చెప్పారు. కేంద్ర సెక్రటరీ ఈనెల 21న పాడేరు మండలం వంట్లమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో పాల్గొంటారని పిఓ చెప్పారు. వికషిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించడానికి వంట్లమామిడిలో పర్యటిస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి. వి.ఆర్.ఎం. రాజు, డిఎం అండ్ హెచ్ ఓ జామాల్ బాషా, ఎంపిడిఓ నవీన్, ఐటిడిఏ ఎఎఓ శ్రీనివాస కుమార్, ఎఇ దేముళ్లు, ట్రైకార్ అసిస్టెంట్ సీతారామయ్య పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో

తాగునీటి సమస్యపై ఐటిడిఎ ముట్టడి

- ఖాళీ బకెట్లు, వాటర్ బాటిళ్లతో విద్యార్థినుల నిరసన
- మూడు కిలో మీటర్ల మేర నడిచి వచ్చిన అమ్మయిలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి- రంపచోడవరం

తమ ఆశ్రమ పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరతూ స్థానిక ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు సోమవారం మూడు కిలో మీటర్లు కాలినడకన వచ్చి ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడించారు. ఐటిడిఎ పిఒకు విన్నవించేందుకు సోమవారం ఉదయం విద్యార్థినులందరూ ఖాళీ బకెట్లు, వాటర్ బాటిళ్లు చేతపట్టి పాఠశాల నుండి బయలుదేరగా, వారిని పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారు. అయినా విద్యార్థినులు వెనక్కి తగ్గకుండా సుమారు మూడు కిలోమీటర్లు మేర రోడ్లపై పరుగులు పెడుతూ ఐటీడీఏ కార్యాలయానికి చేరుకొని అక్కడ నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో విద్యార్థినుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా పాఠశాలలో తాగునీరు లేదని, మరుగుదొడ్లలో సైతం నీరు రావడం లేదని, 500 మంది విద్యార్థినులు ఉండగా, కేవలం 3 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, మిగిలినవి మరమ్మతులకు గురికావడంతో ఉపయోగంలో లేవని తెలిపారు. నీటి కోసం సమీపంలో ఉన్న హాస్టల్‌కు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం కూడా సరిగా పెట్టడం లేదని, రెండు రోజుల క్రితం వండిన వంకాయ కూరలో నత్తలు, పురుగులు ఉన్నాయని చెప్పగా వాటిని పక్కన పడేసి తినాలని తమను బెదిరించారని విద్యార్థినులు వాపోయారు. ఈ సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, అందుకే ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువచ్చేందుకు వచ్చామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న హెచ్ఎంను బదిలీ చేయాలని, లేకుంటే తాము పాఠశాల నుండి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యార్థినులు స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఐటీడీఏ పిఓ విద్యార్థినులతో కలిసి బస్సులో పాఠశాలకు వెళ్లి అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని విచారణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పిఓ హామీ ఇచ్చారు.

విద్యార్థినులకు సిపిఎం నేతల సంఘీభావం

విద్యార్థినులు ఐటిడిఏ ముట్టడి విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు మట్ల వాణిశ్రీ, సిరిమల్లె రెడ్డి, శాంతిరాజు జగదీష్ ఐటీడీఏ వద్దకు వచ్చి విద్యార్థినులకు సంఘీభావం తెలిపారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం ఐటీడీఏ పీవోకు విద్యార్థులు పడుతున్న సమస్యలను వివరించి ఐటిడిఏ పిఓతో పాటు పాఠశలకు వెళ్లి అక్కడ వాళ్ళు చెప్పిన సమస్యలను పరిశీలించారు. విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యేవరకు సిపిఎం అండగా ఉంటుందని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

ఆసుపత్రిలో పసికందు మృతి

వైద్యుని నిర్లక్ష్యం వల్లే అంటున్న బాధితులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజుల పసికందు సరైన వైద్యం అందక మృతి చెందింది. వైద్యుని నిర్లక్ష్యం వల్లే మృతి చెందినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన పసికందు తల్లిదండ్రులు శిరీష, వెంకన్న తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని రాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన గర్భిణి తెల్లం శిరీష మూడు రోజుల క్రితం రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన ఆ పసి పాపకు మూడు రోజుల నుండి వాంతులు అవటంతో తల్లి శిరీష డాక్టర్‌కు తెలియజేసింది. పరీక్షించిన డాక్టర్ పర్వాలేదని చెప్పారు. మళ్ళీ అలాగే వాంతులు అవుతుంటే ఆ సమయంలో డాక్టర్ లేకపోవడంతో నర్సులకు చెప్పగా, ఆమె డాక్టర్‌కు ఫోన్ చేయగా,



పసికందు మృతదేహం వద్ద తల్లి శిరీష

టానిక్ సూచించగా, అది ఇచ్చారు. టానిక్ వాడినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం 6 గంటలకు పసికందును కోతుల గుట్ట ఆస్పత్రికి అంబులెన్స్‌తో తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. డెలివరీ అయిన తరువాత ఒక్క సారి మాత్రమే డాక్టర్ వచ్చి చూశారని, తరువాత ఎన్నిసార్లు అడిగినా నర్సులు వచ్చి చూశారు తప్పా డాక్టర్ రాలేదని, డాక్టర్ నిర్లక్ష్యం వల్లే పాప మృతి చెందిందని శిరీష, వెంకన్న ఆరోపించారు. పాప మంచిగా ఉంటే ఎందుకు మృతి చెందిందో డాక్టర్ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ వల్ల కాదంటే తాము ఎక్కడికైనా తీసుకెళ్లి ఉండేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. రేఖపల్లి, రాయిగూడెం ఆస్పత్రులలో వైద్యులు రోగులను మంచిగా చూడటం లేదని, అక్కడ నర్సులే వైద్యం చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి వేళ వచ్చినా కోతులగుట్ట సిహెచ్‌సికి పంపిస్తున్నారన్నారు. గతంలో కూడా అంగన్వాడీ టీచర్ సుబ్బలక్ష్మి గుండె నొప్పితో ఆసుపత్రికి వస్తే డాక్టర్ సమయానికి రాకపోవడంతో ఆమె మృతి చెందారని, అలాంటివి ఎన్నో జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా
-మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో విస్తృత పర్యటన



ఎస్‌పి, ఎఎస్‌పికి థింసా నృత్యంతో ఘనంగా స్వాగతం పలుకుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

సంఘ విద్రోహశక్తులకు, గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా హితవుపలికారు. గిరిజన గ్రామాల అభివృద్ధిపై పోలీసు వ్యవస్థ దష్టి సారించించినట్లు చెప్పారు. జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కొమ్ములు వాడ, బంద వీధి, కొత్త పాకల, గొర్రె లోవ తదితర గ్రామాల్లో సోమవారం ఎస్ఐ విస్తృతంగా పర్యటించారు. గొర్రెలోవలో అమృత జలధార మంచినీటి ట్యాంకు, మంచినీటి కొళాయిలు ప్రారంభించారు. గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సంఘ విద్రోహశక్తులతో చేతులు కలిపాన, గంజాయి సాగు చేసినా తమకు సమాచారం వెంటనే చేరవేయాలని కోరారు. యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందడానికి పోలీసులు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. గంజాయి పంటలకు ప్రత్యామ్నాయంగా జీడి మామిడి, రాజ్‌మా, మినుము తదితర పంటలు పండించే విధంగా విత్తనాలు సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. ఇటీవల చింతపల్లి అడిషనల్ ఎస్పి శివ ప్రతాప్ కిషోర్ ఆధ్వర్యంలో సదరన్ క్యాంపు నిర్వహించి జీకే వీధి, చింతపల్లి మండలాల పరిధిలో సుమారు 1000 మందికి వికలాంగ పించన్లు, బస్సు పాసులు వచ్చే విధంగా పోలీసులు చొరవ చూపినట్లు తెలిపారు. ఇప్పటికీ గొర్రెలోవలో కొంతమంది వికలాంగులు ఉన్నారని, వారికి కూడా సదరం సర్టిఫికెట్లు వచ్చే విధంగా కషి చేస్తామన్నారు. యువతకి ఇప్పటికే నర్సింగ్, టాటా ఎలక్ట్రికల్ ఉద్యోగాలు పోలీస్‌ల ద్వారా ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. ముందు ముందు గ్రామాలు ఇంకా అభివృద్ధి చెందాలంటే యువత మావోయిస్టులకు ఆకర్షణలు కాకూడదని హితవుపలికారు. అనంతరం గిరిజన యువ క్రీడాకారులతో కలిసి ఎస్‌పి, చింతపల్లి అడిషనల్ ఎస్పీ వాలీబాల్ ఆడారు. క్రీడాకారులకు ఉచితంగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మావోయిస్టు నేత జగన్ కుటుంబ సభ్యులకు ఎస్పీ రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. జగన్ బంధువులు స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులకు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు.

సిఐ, ఎస్ఐలకు ప్రశంస

మారుమూల గిరిజన గ్రామాల్లో సమస్యలపై నిరంతరం అన్వేషిస్తూ విధి నిర్వహణ చక్కగా నిర్వర్తిస్తున్నారని జీకే వీధి సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ అప్పలసూరి, సీలేరు ఎస్సై రామకష్ణలను ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్ సుందరం, దుప్పులవాడ సర్పంచ్ కె.కుమారి, సిపిఐ మండల నాయకులు సుంకర విష్ణుమూర్తి, గిరిజనులు, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

మధ్యాహ్నం భోజన పథకం, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం మండలం విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.మల్లిరెడ్డి మధ్యాహ్నం భోజనం మరియు స్కూల్ శానిటేషన్ కార్మికులు గౌరవ అధ్యక్షుడు కె.శాంతిరాజు మాట్లాడుతూ వైసిపి కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయిందని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తెల్సుకొవడానికి మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ కార్మికులందరూ ఐక్యంగా పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, పెట్టుబడి బిల్లులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థికి మెస్ చార్జీలు రూ.20కు పెంచాలని, ప్రతి నెల 5వ, తారీఖులోపు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కలిపించాలని, యూనిఫామ్, వంటపాత్రలు ఇవ్వాలని, వేతనం రూ.10వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే దశలు వారీగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమారి,పద్మ, బాపనమ్మ. తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని..

అంగన్ వాడీల నిరసన దీక్షలు, ధర్నాలు

-డిసెంబర్ 8 నుండి సమ్మె - అధికారులకు సమ్మె నోటీసులు అందజేత



పాడేరులో దీక్ష చేపడుతున్న అంగన్‌వాడీలు



చింతపల్లిలో నినాదాలు చేస్తున్న చిన్నయ్యపడాల్, అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలను పరిష్కారం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నిరసిస్తూ అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఐసిడిఎస్ ప్రాజెక్టుల ఎదుట సోమవారం అంగన్వాడి వర్కర్లు నిరసన దీక్షలు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించుకుంటే డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సమ్మె నోటీసును ప్రాజెక్ట్ సిడిపిఓలకు అందజేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పాడేరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు ఎల్.సుందరరావు మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నారి, అంబిక పాల్గొన్నారు

డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సోమవారం ధర్నా చేపట్టారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు కే.కొండమ్మ మాట్లాడుతూ, మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలన్నారు. సమ్మె నోటీసును సిడిపిఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కే.సత్యవతి, జి.పవిత్ర పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు:సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ ర్యాలీ నిర్వహించి, మానహారరంగా ఏర్పడ్డారు. సమస్యలపై నినాదాలు చేశారు. ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు పాంగి భీమరాజు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు సుజాత, సత్యవతి, చిలకమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి:అంగన్వాడి అక్కా చెల్లెమ్మల పోరాటం జగన్మోహన్ రెడ్డికి కనిపించ లేదా అని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. ఒక్కరోజు సామూహిక నిరాహార దీక్ష చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఈనెల 23న రౌండ్ టేబుల్ సమావేశాలు, వచ్చే నెల 6న అంబేద్కర్ విగ్రహాలకు సమ్మె వినతి పత్రాలు, 8న సమ్మె చేపడ తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాములమ్మ, .పెంటమ్మ, సెక్టార్ బాధ్యులు అక్కమ్మ, లక్ష్మి, రత్నం, నీలమ్మ, ప్రశాంతి పాల్గొన్నారు.



కొయ్యూరులో నిరసన

పెదబయలు : స్థానిక సీఐటీయు కార్యాలయం నుండి సీఐటీయు మండల కార్యదర్శి సిహెచ్ రామారావు, మహిళా సంఘం అధ్యక్షులు కౌసల్య, అంగన్వాడీ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు రాజమ్మ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూడా కొండమ్మ, సిహెచ్ పద్మ, కటారి కొండమ్మ పాల్గొన్నారు.

అనంతగిరి:స్థానిక స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో, మోస్య మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జీ.కళావతి, మండల అధ్యక్షులు పి.మంజుల, కె.లక్ష్మీ, వి, సుమిత్ర. జి. అరుణ పాల్గొన్నారు

కొయ్యూరు : మండలం కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై అప్పలనాయుడు, అంగన్వాడీ నాయకులు ఎల్ ముత్యాలమ్మ, ఎ.అచ్చియమ్మ,, పూర్ణ, ఎం వెంకటలక్ష్మి, బంగారమ్మ, రాజేశ్వరి, అమ్మాజీ, వెంకట రమణ, రత్నం, కళ, పి. సత్యవేణి, డి.వెంకట రమణమ్మ, రమణమ్మ, ఎం దేవుడమ్మ,, జీవనజ్యోతి, గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

సీలేరు : అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీకే వీధి మండల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఏ.బుజ్జిబాబు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నరసయ్య, సత్యవతి, దయ వెంకటి, చిరంజీవి, భువనేశ్వరి, మేరీ, భవాని, గిరిజన సంఘ అధ్యక్షులు కే. బాలయ్య, మురళి, చంటిబాబు, పరమేష్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ నోటిఫికేషన్ రద్దుచేయాలి

- ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్- డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి -పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లాలో వివిధ పోస్టుల భర్తీకి ఇటీవల జారీ చేసిన ఐసిడిఎస్ నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఆదివాసీ షెడ్యూల్ జిల్లాలో ఆదివాసులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆదివాసి హక్కులు, చట్టాలకు విరుద్ధంగా మిషన్ వాత్సల్య – అల్లూరి సీతారామరాజు జిల్లా, మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో గిరిజనేతరులకు కేటాయిస్తూ ఇచ్చిన నోటి ఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులతో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్లో డిఆర్ఓ అంబేద్కర్‌కు సోమవారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మన్న పడాల్, జిల్లా నాయకులు పి.సురేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్యలో మంజూరైన పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఆదివాసీ ఎస్టీలకు ఒక్క పోస్ట్ కూడా కేటాయించకుండా అన్యాయం చేశారని విమర్శించారు.అల్లూరి సీతారామరాజు జిల్లా పునర్వ్యవస్థీకరణ సందర్భంగా ఆదివాసీల కోసం అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నూతనంగా ఏర్పడిన ఆదివాసీ జిల్లాలో మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్యలో మంజూరైన పోస్టులు భర్తీ చేయడం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. అర్హులైన ఆదివాసి నిరుద్యోగులకు ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వెల్లడించారు.



వినతి పత్రం అందిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

అగ్ని ప్రమాదంలో బాలిక మృతి



రోధిస్తున్న తల్లిదండ్రులు ,బంధువులు,

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని అన్నవరం పంచాయతీ అన్నవరం గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. తల్లిదండ్రుల ముందు ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారి తమ కళ్ళ ఎదుటే అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో, తల్లిదండ్రుల రోదన అంతా ఇంతా కాదు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం మేరకు...అన్నవరంకి చెందిన గెమ్మెల రాజేష్ తన కుటుంబంతో కలిసి చిన్న పాకలో తినుబండారాలు తయారు చేసే దుకాణాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అన్నవరం సంత కావడంతో ఉదయం అరిసెలు తయారు చేసేందుకు కట్టెల పొయ్యిని సిద్ధం చేసి దానిపై నూనె పెట్టి పిండి కలిపేందుకని ఇంటి లోపటికి వెళ్లాడు. అక్కడే ఆడుకుంటున్న తన కూతురు నిత్య (5) కట్టెల పొయ్యిపై ఉన్న నూనెలో ప్రమాదవశాత్తు పడింది. నూనె మరుగుతుండడం, కట్టెల పొయ్యి కావడంతో వెంటనే మంటలు పాక అంతట వ్యాపించడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు, తండ్రి రాజేష్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ, మంటలు అదుపులోకి రాలేదు. ఆ మంటల్లోనే బాలిక మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చంద్రబాబు విడుదలపై టిడిపి నేతల హర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్కిల్ డెవలప్మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు సోమవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి వి.నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, వైసిపి పార్టీ కక్ష సాధింపు కోసం ఎటువంటి తప్పు చేయక పోయినా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి పార్టీకి రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని చెప్పారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న మండలంలోని కించుమండ నుంచి అరకులోయ వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, ఎస్టీ సెల్ అరకు పార్లమెంట్ కోశాధికారి కే సుబ్బారావు పాల్గొన్నారు.



స్వీట్లు పెడుతున్న నాయకులు

హెల్మెట్ ధరించాలి

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాసు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక సందర్శిత ప్రాంతాలైన చాపరాయి జలపాతం, పద్మావతి గార్డెన్, రణజిల్లడ జల విహారి తదితర ప్రాంతాల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాసు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో మైదాన ప్రాంతాల నుండి పర్యాటకులు అధికంగా తరలి వస్తున్నారని, వాహనాల రికార్డులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శని, ఆది, సోమవారం పర్యాటకుల రద్దీ ఉండటంతో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేస్తామన్నారు. వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామన్నారు.

నేడు అనంతగిరి మండల సమావేశం

ప్రజాశక్తి అనంతగిరి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అర్జిత్ రాజ్యం పేర్కొన్నారు. ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు భేతిరెడ్డి విజయ్, చెరుకురి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపెట్ల ఉమాశంకర్‌గణేష్ సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట సతీమణి కళావతి, కుమారులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో సోమవారం నర్సీపట్నం మార్కెట్ కమిటీ చెర్మన్ చిటికెల భాస్కరనాయుడు, సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే గణేష్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొండతల్లి, ఎంపిటిసి మామిడి కృష్ణ, సచివాలయ కన్వీనర్ లగుడు ప్రకాష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులులు పి.శివసత్యనారాయణ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేత

ప్రజాశక్తి-చీడికాడ: స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోవిందరావుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మండలంలోని కొనాం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న గోవిందరావు ఇటీవల అక్రమంగా గంజాయి తరలిస్తున్న కారును అడ్డగించి సినీ పక్కీలో స్వాధీన పరుచుకున్నారు. సమాచారాన్ని ఎస్ఐ పి రామారావుకు అందించి తప్పించుకుని పారిపోయిన నిందితులను ఎస్సై ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్‌కు అనకాపల్లి జిల్లా ఎస్పీ శనివారం తన కార్యాలయంలో ప్రశంస పత్రాన్ని అందజేశారు.

క్విజ్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన ప్రాంత్ స్థాయి భారత్ కో జానో క్విజ్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవశం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో అజితేష్ త్రిపాఠీ, గణేష్ పార్థు బహుమతి సాధించి ఈనెల 26న విశాఖపట్నంలో జరిగే రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో లలిత శరణ్య, ఇ.హర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి. వి.ఎస్. మూర్తి అభినందించారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

మండల కేంద్రరలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. తెరవెనుక ప్లాస్టిక్ కవర్లను ఏర్పాటు చేసి శాశ్వత గృహలు, షాపులను గిరిజనేతరులు నిర్మించుకుంటున్నారు. 1/70 భూ బదలాయింపు చట్టానికి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుకు పక్కన ఓ గిరిజనేతరుడు అక్రమంగా దుకాణాలు నిర్మిస్తున్నాడు. అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి నిలుపుదల చేయాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే గిరిజనేతరులకు ప్రోత్సహిస్తుండటంపై మండల కేంద్రం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

ఈ విషయంపై స్థానిక పోతంగి పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా అక్రమంగా నిర్మాణం చేపడుతున్న కట్టడాలపై ఇప్పటికీ ఫిర్యాదు రాలేదన్నారు.



చేపడుతన్న అక్రమ కట్టడం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



డుంబ్రిగుడులో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు వంటివని ఎంపీడీవో ఉషారాణి అన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత అధ్వర్యాన వారోత్సవాల ముగింపు సోమవారం ఆటపాటలతో ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, తెదేపా మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, తెదేపా అరకు పార్లమెంట్ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు కె.సుబ్బారావు, టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, ప్రధానోపాధ్యాయులు అర్జున్, కృష్ణారావు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శాఖ గ్రంథాలయం అధికారిని వి.మానస, సర్పంచ్ వెంకటపూర్ణిమ, రామలింగం, ఉపాధ్యాయులు గంగా భవాని, రామలక్ష్మి బహుమతులు అందజేశారు.

కూనవరం: మండలం కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్, విజయ సాధన పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ దేశ నాయకులు వేషధారణతో అలరించారు. నాటికలు ప్రదర్శించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలలో విజేతులైన వారికి అతిథులు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మాని అనంత లక్ష్మి, డాక్టర్ దుద్దుకూరి వెంకయ్య, ఉల్లూరి సాయిబాబు, అరుణకుమారి, రాజేశ్వరి, అధ్యాపకులు రమాదేవి, సత్యనారాయణ, నోముల సత్యనారాయణ, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయం పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు ల ర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, గ్రంథాలయ అధికారి ఎమ్ గోవిందారాజు, అధ్యాపకులు జి.వెంకట్రావు, బి.ఎస్.నాయుడు, జి. హారతి, ఎస్. అప్పనమ్మ, కె. శైలజ, కె. శకుంతల, కె. శ్రీదేవి, కె. శ్రీలక్ష్మి, సి.హెచ్. రాజబాబు, ఆర్. మౌనిక, పి. గౌతమి,జి. సాయికుమార్, పి. అలివేలు, ఎస్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి క్లారిట్ యాప్ ద్వారా కొత్త పనులు గుర్తిస్తామని ఉపాధి హామీ ఏపీవో గంగు నాయుడు తెలిపారు. సోమవారం ఉపాధి సిబ్బంది కోటవురట్ల, అన్నవరం, ఎండపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించారు. కోటవురట్ల గ్రామానికి రూ.1.50 కోట్లతో పనులు గుర్తించనున్నట్లు తెలిపారు. అన్నవరంలో రూ.40 లక్షలు, ఎండపల్లిలో 43 లక్షలతో పనులు గ్రామసభ ద్వారా ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సరంలో చేపట్టే పనుల మ్యాప్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ మాట్లాడుతూ, వంద రోజుల ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ, ఉపాధి హామీ మేట్లు పాల్గొన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-నక్కపల్లి: కరువుతో రైతులు ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వానికి పట్టకపోవడం అత్యంత దారుణమని, తక్షణమే అనకాపల్లి ని కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెంలో రైతులతో కలిసి ఎండిపోయిన వరి పొలాలు పరిశీలించారు. రైతులు వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వర్షాలు లేక ఎండిపోయిన వరి పొలాలు చూసి ఆయన ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వర్షా భావ లోటు కారణంగా ఇంత తీవ్రంగా కరువు కాటకాలతో రైతులు, కూలీలు అల్లాడుపోతుంటే, ప్రభుత్వం ఇంతవరకు ఆదుకునే చర్యలు చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో 679 మండలాలకు 350 మండలాల పై వర్షాలు పడక తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉంటే కేవలం 7 జిల్లాలో 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.

అనకాపల్లి జిల్లా లో ఎన్నడూ లేని విధంగా కరువు ఉండగా అదికార పార్టీ మంత్రులు సాధికార బస్సు యాత్రలు చేస్తూన్నారని విమర్శించారు.పొలం బాట పడితే జిల్లాలో ఉన్న కరువు, రైతులు కష్టాలు కనబడతాయన్నారు.ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా జిల్లా పరిషత్ సమావేశంలో కరువు జిల్లాగా ప్రకటించాలని తీర్మానం చేశారని, తీర్మానం చేసి చేతులు దులుపుకోవడం కాకుండా జిల్లా మంత్రులకు జిల్లాలో ఉన్న కరువు పరిస్థితులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ఒత్తిడి తెచ్చి వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణ చర్యలు చేపట్టాలని రైతులను, కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.బంగార్రాజు, ఎం.శ్రీను, డి.నానీ,జీ.రమణ,జీ.శేషు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి -రావికమతం: సెల్ టవర్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో పొర్లుపాలెం గ్రామస్తులు తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోకివాడ రమణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శివలంక కొండలరావు మాట్లాడుతూ, మండలంలో తట్టబంద పంచాయతీ పొర్లుపాలెం గ్రామానికి అంగన్వాడి, పాఠశాల, సామాజిక భవనం, రక్షిత మంచినీటి పథకం, మినీ గ్రంథాలయం, ప్రాథమిక ఉపకేంద్రం మంజూరు చేయాలని గత కొంతకాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. వీటి కోసం కేటాయించిన స్థలంలో గ్రామస్తుల అభ్యంతరాలకు వ్యతిరేకంగా సెల్ టవర్ నిర్మాణానికి ప్రతిపాదించడం సరికాదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమణలో ఉన్నందున సర్వే నంబరు 39లో రెండు స్థలం ఖాళీగా ఉన్నందున సెల్ టవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు.ప్రభుత్వ స్థలాలు స్వచ్ఛందంగా అప్పగిస్తే గ్రామస్తులకు ఇబ్బంది లేని ప్రభుత్వ స్థలంలో సెల్ టవర్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జోగురాజు, వార్డుమెంబర్ ఎజ్జి శ్రీను, రమణ, ఎంగలి ఈశ్వరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

మాడుగుల: టిడిపి అధినేత చంద్ర బాబుకు బెయిల్ రావడంపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నిజాయితీపరుడని, కోర్టులు సైతం నమ్ముతున్నాయని తెలిపారు.అందుకే చంద్రబాబు నాయుడు అరెస్టును ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించి సంఘీభావం తెలిపారన్నారు. తెలుగుదేశం నాయకులు ఉండూరు దేవుడు, పుప్పాల అప్పలరాజు , ఒంద్రు గంగమ్మ కృష్ణ, మజ్జి తాతబాబు, వడ్డీ రాజ్ కుమార్‌లు హర్షం ప్రకటించారు.

వైసిపి నాలుగేళ్ల పాలనపై ప్రచారం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం గోపవరం గ్రామంలో చిట్టెంపాడు గ్రామ సచివాలయ కన్వీనర్ పెట్ల గాంధీ ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వైసీపీ నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు అప్పన్నబాబు, దేవి, గృహ సారధి కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని చావడికోట సచివాలయం పరిధిలో ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం వైసిపి కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జేఏసీ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్, పార్టీ మండల కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, ఏఎంసి డైరెక్టర్ దూడ స్మిత్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కొయ్యూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎస్సై రాజారావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం తమ సిబ్బంది, స్థానిక పెద్దలు సత్యనారాయణతో కలిసి మండలంలోని వెలగలపాలెం నుంచి చింతపల్లి వెళ్లే రహదారిలోని ఘాట్ మలుపుల వద్ద వాహనాల వేగ నియంత్రణకు, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు స్టాపర్లను, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అతి వేగంగా వాహనాలు నడపరాదని, నిదానమే ప్రధానమని హితవు పలికారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

స్పందనకు 71 దరఖాస్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు మండలాల నుండి ప్రజలు 71 దరఖాస్తులు అందజేశారు. వీటిని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్వీకరించారు. అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పిఒ, సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఏడియంహెచ్ఓ జి.ప్రకాశం, ఎపీడీ వెలుగు ఎ.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. డేవిడ్ రాజ్, ఎండి.యూసఫ్, సుబ్బయ్య, పిఎఓ రాంబాబు, పిహెచ్ఓ చిట్టిబాబు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మర్రివాడ పంచాయతీ పరిధి గుడ్లపల్లి గ్రామంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు గొలిసింగి సత్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి, దాని గురించి ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి లేదని, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని కోరారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని సూరేంద్రపాలెం గ్రామ శివారులో సోమవారం నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజారావు తెలిపారు. సూరేంద్రపాలెం గ్రామ శివారులలో నాటుసారా తయారు చేస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, అదే గ్రామానికి చెందిన నూకరాజు నాటుసారా తయారు చేస్తున్నాడని గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు నూకరాజును అరెస్టు చేసి ఆయన వద్ద నుండి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు నూకరాజుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరలో గైనిక్, దంత వైద్యుల పోస్టుల భర్తీ

డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో త్వరలోనే గైనిక్ వైద్య నిపుణులు, దంత వైద్యుల పోస్టులు భర్తీ చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్‌ఎస్) డాక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. కూనవరం మండలం కోతులగుట్ట సిహెచ్‌సిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే కూనవరం సిహెచ్‌సికి రెగ్యులర్ జనరల్ సర్జన్, చర్మవ్యాధి నిపుణులతో పాటు ముగ్గురు రెగ్యులర్ వైద్యాధికారులను నియమించినట్లు చెప్పారు. మిగతా స్పెషలిస్ట్ పోస్టులు ఎనస్థీషియా, చిన్న పిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్ పోస్టులు కూడా భర్తీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్ళి పోషకాహారలోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని ఎన్‌ఆర్‌సి కేంద్రంలో చేర్పించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కూనవరం ఆసుపత్రి సిబ్బందికి నివాస క్వార్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్ళడంతో పక్కనే ఉన్న పాత ప్రయివేటు క్వార్టర్లను పరిశీంచారు. వీటిని ఉపయోగపరిచే విధంగా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టివి.శేషారెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ కె.మహేష్ బాబు, వైద్యులు డాక్టర్ తేజ, డాక్టర్ సంతోష్, డాక్టర్ అర్బాజ్ ఖాన్, హెడ్ నర్స్ బి.బొజ్జి, డిసిహెచ్‌ఎస్ పాడేరు



వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు

గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొండగోకిరి గ్రామ సచివాలయాన్ని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో 24 గ్రామ పంచాయతీలుంటే ఇప్పటి వరకు 14 గ్రామ సచివాలయాల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పాలనలో వచ్చిన మార్పులను గత ప్రభుత్వానికి, వైసిపి ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు.

గతంలో ఏ పని జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లి అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, నేడు గ్రామానికే అధికారులను తీసుకొచ్చి పాలనను ప్రజలకు చేరువ చేసిన ఈ వ్యవస్థ అద్భుతంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సచివాలయ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, స్థానిక సర్పంచులు రేగటి ముసలి నాయుడు, పాటి నూకరత్నం, రీమల శ్రీను, ఉప సర్పంచ్ కొమరపు బాబూజీ, ఎంపిటిసి సడ్డ మల్లేశ్వరి, సచివాలయ కన్వీనర్ పాటి శేఖర్, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, ఎఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జడ్డంగి సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచుల సమైక్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ తదితరులు సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జడ్డంగి నుండి చిన్నయ్యపాలెం, జమ్మిసవిడి మీదుగా సింగంపల్లి తారు రోడ్డు నిర్మించాలని, జడ్డంగి ఆసుపత్రిలో బర్త్ వెయిటంగ్ హాలు ఏర్పాటు చేయాలని, రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రులో ఓపికి తగినట్లు మందుల బడ్జెట్ పెంచాలని, పీహెచ్‌సి చుట్టూ అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలని, జడ్డంగి చైతన్ నగర్‌లో అంగన్వాడీ కేంద్రం నిర్మించాలని, రేవటిపాలెంలో ఎంపీపీ పాఠశాల భవననిర్మాణం చేపట్టాలని, జాతీయ రహదారి నిర్మాణంలోఇల్లు కోల్పోయిన వారికి త్వరితగతిన పరిహారం చెల్లించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, వైసిపి నాయకులు వీరమల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న నేతలు



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

స్టీల్ త్రిఫ్ట్ సొసైటీలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను సంఘ ఉపాధ్యక్షులు కె. ఆనందకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా డివిజనల్ కోపరేటివ్ అధికారి .పి.దుర్గాప్రసాద్ పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని క్రమశిక్షణతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ సొసైటీగా పురోభివృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. సహకార యూనియన్ లెక్చరర్ జి.సోమేశ్వరరావు సహకార జెండా విశిష్టతను వివరించారు. కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూఈ ఏడాది 'సహకార విద్య, శిక్షణ పునరుద్ధరణ' థీమ్‌తో సహకార వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. డైరక్టర్ ఎమ్.వి.రమణ వందన సమర్పణతో ముగిసిన కార్యక్రమంలో కోశాధికారి.కొండరాజు, డైరక్టర్స్ కె. శ్రీనివాస్, లాలు భూక్య, .వి.జి.మహిదర్, మాజీ ఉపాధ్యక్షులు ఎస్. సత్యనారాయణ, కోపరేటివ్ సోర్స్ అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షులుఆకుల నూకరాజు, ఇ.లోకేష్, నాగబాబు, సొసైటీ సీనియర్ మేనేజర్ కె.దామోదర్ రెడ్డి, కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది, త్రిఫ్ట్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు

ఐక్య ఉద్యమాలతో అడ్డుకట్ట



సంఘీభావంగా వామపక్ష కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -గాజువాక: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక , ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాలతో అడ్డుకుంటామని వామపక్ష పార్టీల కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఇందులో భాగంగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం గాజువాక లయన్స్ క్లబ్‌లో ఆర్‌కె.కుమార్, అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశధోరణితో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో 1012 రోజులుగా దీక్షలుచేస్తున్నా కేంద్రంలో చలనం లేదన్నారు.

జివిఎంసిలో సిపిఐ ఫ్లోర్‌లీడర్, 72వ వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న కేంద్రం కుట్రలను ఉద్యమాలతో అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. సదస్సులో ఐఎఫ్‌టియు నేత కె మల్లయ్య, సిఐటియు నేతలు కెఎం శ్రీనివాస్, ఎం రాంబాబు, శంకరరావు, భద్రం, రామునాయుడు, నానిబాబు , విల్లా రామ్మోహన్ కుమార్, కసిరెడ్డి సత్యనారాయణ, కె. రాజబాబు , బూసి వెంకటరావు , జె. రామకృష్ణ , ఎం.మన్మధరావు , జి. ఆనంద్, రెహమాన్, కె సత్యాంజనేయ పాల్గొన్నారు.